VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ ఆదివారం 21 జూలై 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 364

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



2లో

**ఊరట కలిగిస్తున్న రుణమాఫీ**

# నిరుద్యోగుల బాధలు
# మాకు తెలుసు



**హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం మరో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. సివిల్స్ అభ్యర్థులకు చేయూతనిచ్చేలా ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం అందించనున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం'పథకాన్ని ప్రజాభవన్‌లో శనివారం ప్రారంభించారు. ఇందులో భాగంగా సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన రాష్ట్ర అభ్యర్థులకు సింగరేణి సంస్థ ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయం అందించనున్నారు. నియామకాల కోసమే తెలంగాణ పోరాటం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. త్యాగాల పునాదులపై తెలంగాణ ఏర్పడిందన్నారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించడ మే ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. అందుకే అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో 30వేల ఉద్యోగ నియామక పత్రాలు అందించామన్నారు. గత పదేళ్లలో నిరుద్యోగులకు తీరని నష్టం జరిగిందని అన్నారు. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని మార్పులు చేశామని తెలిపారు. గ్రూప్స్ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించామన్నారు. అంతకుముందు సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన రాష్ట్ర అభ్యర్థులతో సీఎం ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రులు భట్టి విక్రమార్క, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, సింగరేణి సీఎండీ బలరామ్ పాల్గొన్నారు. ఉద్యోగ నియామకాల కోసమే రాష్ట్రాన్ని సాధించుకున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యార్థుల త్యాగాలతో రాష్ట్రం ఏర్పడింది. 90 రోజుల్లో 30 వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశాం. ఏళ్ల తరబడి ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్నారు. నిరుద్యోగుల బాధలు మాకు తెలుసు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్స్ ఇచ్చాం. టీజీపీఎస్సీని పునర్వ్యవస్థీకరించాం. పరీక్షలు మాటిమాటికి వాయిదా పడటం మంచిదికాదు. అభ్యర్థుల సమస్యలను అర్థం చేసుకుని గ్రూప్-2ను వాయిదా వేశాం. నిరుద్యోగుల సమస్యల పరిష్కారమే తొలి ప్రాధాన్యం అని సిఎం అన్నారు. ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేస్తాం. ప్రణాళిక ప్రకారం ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేస్తున్నాం. జూన్ 2న నోటిఫికేషన్, డిసెంబర్ 9 లోపు ఉద్యోగాలిచ్చేలా జాబ్ క్యాలెండర్ రూపొందిస్తాం. సివిల్స్ అభ్యర్థులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం తరఫున సాయం చేస్తున్నాం. మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులు కచ్చితంగా జాబ్ సాధించాలి. సివిల్స్ సాధించి మన రాష్ట్రానికే రావాలి. ఐఏఎస్, ఐపీఎస్‌లు మన వారైతే రాష్ట్రానికి మంచి జరుగుతుంది.నోటిఫికేషన్ ఇచ్చి సమయానికి పరీక్షలు నిర్వహించిన దాఖలాలు గత పదేళ్లలో లేవు. అందుకు కారణమేదైనా యువత ఉజ్వల భవిష్యత్ ఆగమైంది. దురదృష్టవశాత్తూ కొన్నేళ్లుగా తెలంగాణలో యువత ఉద్యోగాలకు సన్నద్ధమయ్యేదానికంటే.. పరీక్షల్లో జరిగే నిర్వహణ లోపాలపై కొట్లాడేందుకే వారి సమయం వృథా అయ్యింది. యూపీఎస్సీ ఎప్పుడు పరీక్షలు నిర్వహించినా.. వాటిపై ఆరోపణలు లేవు. అందుకే మేం గతంలో యూపీఎస్సీ ఛైర్మన్‌ను కలిశాం. యూపీఎస్సీ తరహాలో కొన్ని మార్పులు చేసి వెంట వెంటనే నోటిఫికేషన్లు ఇస్తున్నాం అని రేవంత్‌రెడ్డి తెలిపారు. డీఎస్సీ పరీక్షలు కొనసాగుతున్నాయన్నారు.

నిరుద్యోగుల ఇబ్బందులను గుర్తించి గ్రూప్-2 పరీక్ష వాయిదా వేశామని చెప్పారు. ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించడమే అని తెలిపారు. పకడ్బందీ ప్రణాళికతో పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అసెంబ్లీ సమావేశాల్లోనే జాబ్ క్యాలెండర్ ప్రవేశపెట్టనున్నామని తెలిపారు. ఇక నుంచి ప్రతీ ఏటా మార్చ్‌లోగా అన్ని శాఖలలో ఖాళీల వివరాలు తెప్పించుకుంటామన్నారు. జూన్ 2 లోగా నోటిఫికేషన్ వేసి డిసెంబర్ 9లోగా నియామక పక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. మంచి కార్యక్రమాన్ని చేపట్టిన సింగరేణి సంస్థకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. సివిల్స్ అభ్యర్థులను ప్రోత్సహించడానికి ప్రభుత్వ తరఫున సాయం చేస్తున్నామని సీఎం రేవంత్ తెలిపారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే జాబ్ క్యాలెండర్ ప్రవేశపెట్టనున్నాం. మరోవైపు, తెలంగాణ స్కిల్స్ యూనివర్శిటీ ఏర్పాటుపై ఈ బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉండాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థినీ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ వర్శిటీని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర పరిశ్రమల

విభాగం ఢిల్లీ, హర్యానాలో ఉన్న స్కిల్ యూనివర్శిటీలను పరిశీలించి.. స్కిల్ వర్శిటీ నమూనా ముసాయిదా తయారుచేసినట్లు పేర్కొన్నారు. ఫార్మా, కన్‌స్ట్రక్షన్స్, బ్యాంకింగ్ ÷నాన్స్ సర్వీసెస్, ఈ కామర్స్ అండ్ లాజిస్టిక్స్, రిటైల్, యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్ గేమింగ్ అండ్ కామిక్స్.. తొలుత ఆరు రంగాల్లో ఉపాధి అవకాశాలున్న కోర్సులు ప్రవేశపెడతారని అన్నారు.

- సివిల్స్ అందుకునే వారి కోసం చేయూత
- రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం'పథకం ప్రారంభం
- సింగరేణి ఆర్థిక సాయంతో అభ్యర్థులకు భరోసా
- ఇకనుంచి ఏటా జూన్‌లో జాబ్ క్యాలెండర్
- డిసెబర్ కల్లా అపాయింట్‌మెంట్లు
- నిరుద్యోగులకు అండగా నిలవడమే మా లక్ష్యం
- సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి



2లో

**క్రమంగా పెరుగుతున్న గోదావరి**

ఎగవ నుంచి భారీగా వస్తొన్న వరదనీరు

లోతట్టు ప్రాంతాల ప్రజల అప్రమత్తం



2లో

**నిరుద్యోగ భృతిపై మోసం**

జాబ్ క్యాలెండర్ ఊసే లేదు

యువమోర్చా ధర్నాలో కిషన్ రెడ్డి



5లో

**పాఠశాల పనివేళల్లో మార్పులు**

## మా ఎమ్మెల్యేలను బెదిరించి చేర్చుకుంటున్నారు

రాష్ట్రంలో రాజ్యాంగంపై దాడి జరుగుతోంది

నిరుద్యోగ హామీలను తుంగలో తొక్కారు

గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన కెటిఆర్ బృందం



2లో

## నేడు ఉజ్జయినీ మహంకాళి బోనాలు

అత్యతంత సుందరగా ఆలయ అలంకరణ

భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

సిసి కెమెరాల ఏర్పాటు..పటిష్ట బందోబస్తు



2లో

# వాయుగుండం ప్రభావంతో విస్తారంగా వర్షాలు

**భారీ వర్షాలతో కృష్ణా, గోదావరి నదుల్లో వరద ఉధృతి**

**ప్రాజెక్టులకు భారీగా వచ్చి చేరుతున్న నీరు**

**పలు ప్రాంతాల్లో సింగరేణి బొగ్గు ఉత్పత్తికి అంతరాయం**

**పలు ప్రాంతాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం**

**అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు సిఎస్ ఆదేశం**



**హైదరాబాద్:** పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండం తీరం వైపునకు కదులుతోంది. పూరీ తీరానికి 40 కిలో మీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రకృతమైందని వాతావరణ అధికారులు వెల్లడించారు. ఒడిశా- ఛత్తీస్ గఢ్ మధ్య తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తర తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. మరోవైపు ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణా, గోదావరి నదుల్లో వరద ఉధృతి పెరుగుతూ వస్తోంది. తెలంగాణలోని పలు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురవడంతో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రాణహిత నది వరద ప్రమాద స్థాయిని దాటి ప్రవాహిస్తోంది. భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. గోదావరి వద్ద నీటమట్టం 30.5 అడుగులకు చేరుకోవడంతో మూడో ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. చర్లలోని తాలిపేరు ప్రాజెక్టు 20 గేట్లు ఎత్తి 66900 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 18,275 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీరాంసాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091 అడుగులుకాగా ప్రస్తుతం 1066 అడుగుల వరకు నీరు చేరింది. ఎడతెరిపి లేకుండా కురుస్తోన్న కుండపోత వానలకు వాగులు, వంకలు పొంగిపొర్లు తున్నాయి. ప్రాజెక్టులు నిండు కుండలా మారాయి. నిన్న రాత్రి నుంచి వర్షం కురుస్తోనే ఉంది. అయితే ఈ వారాంతంలో తెలంగాణ రికార్డు వర్షపాతాన్ని నమోదు చేసింది. రెండ్రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ అధికారులు హెచ్చరించారు.

భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. పలు ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ములుగు జిల్లాలోని వెంకటాపురంలో అత్యధికంగా 109 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చర్లలో 96.8 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఖమ్మం, మహబూబ్‌నగర్, మహబూబాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, కరీంనగర్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 40 నుంచి 80 మి.మీ. వర్షపాతం నమోదైంది.

వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ప్రధానంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీనంగర్, భూపాలపల్లి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. రాబోయే 18 గంటల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. భారీ వర్షాలపై వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. ఉత్తర తెలంగాణా లోని 11 జిల్లాలలో ఈనెల 20 , 21 తేదీలలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు.జూలై 20, 21 తేదీలలో 11 జిల్లాలకు ఆరంజ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్లతో సీఎస్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పెద్దపల్లి, కరీంనగర్, ములుగు, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, హన్మకొండ, జగిత్యాల, ఖమ్మం,కొత్తగూడెం, నిర్మల్ జిల్లాల్లో ఈరోజు, రేపు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ జిల్లాల కలెక్టర్లు ఏవిధమైన ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా సంబంధిత ప్రభుత్వ విభాగాలతో కలసి ముందు జాగ్రత్త

చర్యలు తీసుకోవాలని తెలియచేశారు. ప్రధానంగా వాగుల వద్ద తగు బందోబస్తును ఏర్పాటు చేసి, ప్రమాదకరంగా ప్రవహించే వాగులను ప్రజలు దాటకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ 11 జిల్లాల కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయాలని, పోలీస్ తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఏ విధమైన సహాయం కావాలన్న రాష్ట్ర రాజధానికి ఏ సమయంలోనైనా సంప్రదించవచ్చునని ఆమె అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పెద్ద వాగుకు వచ్చిన ఆకస్మిక వరదల వల్ల చిక్కుకుపోయిన దాదాపు 40 మందికి ఏవిధమైన అపాయం జరుగకుండా వివిధ శాఖల సమన్వయంతో కాపాడినందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ను శాంతి కుమారి అభినందించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఆలుబాకలో బానరి రాజు అనే వ్యక్తి వాగులో చేపల వేటకు వెళ్లి గల్లంతైనట్లు తెలుస్తోంది. పడవల సహాయంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పలుచోట్ల పత్తి, వరి చేళ్లు మునిగిపోయాయి. వరంగల్, హన్మకొండ, జనగామ, మహబూబాబాద్ జిల్లాలో చెరువులు, కుంటలు వర్షపు నీటితో నిండిపోతున్నాయి. భారీ వర్షాలతో పెద్దపల్లి జిల్లా సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. రామగుండం రీజీయన్ లో నాలుగు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో రోజుకు 80 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి బ్రేక్ పడింది. మంచిర్యాలలోని ఓపెన్ కాస్ట్ బొగ్గు గనులలో ఉత్పత్తి నిలిచిపోయింది.

# ఊరట కలిగిస్తున్న రుణమాఫీ

నిజామాబాద్, తాజాగా రైతురుణమాఫీ కొంద ఆదుకున్నదని జిల్లా రైతాంగం అభిప్రాయ పడుతోంది. గతంతో పోలిస్తే ఈ మాఫీ తమకు ఊరట కలిగించేదే అని అన్నారు. గతంలో మాఫీ పేరుతో ప్రకటనలు ఇచ్చినా అమలు కాలేదన్నారు. అనర్హులకు రుణయాఫీ చేయకపోవడం, రైతు భరోసా ఇవ్వకపోవడం మంచి నిర్ణయమని అన్నారు. గతంలో కార్లలో తిరిగే వారు డబ్బులు పోగేసుకునేందుకు వచ్చే వారని అన్నారు. అప్పులు చేసి పెట్టిన పెట్టుబడులన్ని గతేడాది వరదనీటిలో కొట్టుకు పోయాయి. సకాలంలో బ్యాంకు రుణాలు అందకపోయినా ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేసి పంటలు సాగుచేశామని జిల్లా రైతులు వాపోతున్నారు. గత రెండు, మూడు సంవత్సరాల నుంచి నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం అందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరితో పాటు మొక్కజొన్న, పసుపు పంటలు వేస్తున్న రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. నష్టపోయిన పంటలకు, ఆస్తులకు పరిహారం అందించాలన్న డిమాండ్ సర్వత్రా నెలకొంటోంది. ఇదిలావుంటే ప్రకృతి వైపరీత్యాల కారణంగా జరిగిన నష్టాలకు కేంద్రప్రభుత్వమే పరిహారం అందించాల్సి ఉంటుందని అధికార బిఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అమలు చేయకపోగా, అతివృష్టి, అనావృష్టి కారణాల వల్ల పంటలను కోల్పోయే రైతులకు నష్టపరిహారాన్ని ఇచ్చి ఆదుకోవడం లేదు. కంటితుడుపు చర్యలకే పంట నష్టం సర్వేలు జరుగుతున్నాయి. పంట నష్టం గురించి అధికారులు క్షేత్రస్థాయి పర్యటనకు

వచ్చినప్పుడు తమకు ఎంతో కొంత నష్టపరిహారం వస్తుందని ఆశ పడుతున్నారు. వరదల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘాల నాయకులు, ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. దీంతో అతివృష్టి, అనావృష్టి, అకాల వర్షం, వడగండ్లు, కరువుతో పంట నష్ట పోయిన పరిహారం అందక రైతులు అ ప్పుల ఊబిలో కూరకపోతున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం బీమా నిబంధనలు సడలించి గతంలో ఫస ల్ బీమా యోజన పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం లో బ్యాంకుల్లో రుణాలు పొందిన రైతులతో పాటు పొందని రైతులకు అవకాశం కల్పించేవారు. పంట రుణాలు పొందిన రైతులకు బీమా తప్పని సరి. రుణాలు పొందిన వారు ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాల్సి ఉంటుంది. ఎకరం చొప్పున ప్రీమియం చెల్లించడం ద్వారా పైరు నాటు వేసినప్పటి నుంచి కొత కోసే వరకు పంట నష్టానికి బీమా కంపెనీలు బాధ్యత వహిస్తుంటాయి.దేశానికి అన్నం పెట్టే రైతన్నకు భరోసా లేకుండా పోతోంది. పంటల సాగు సమయంలో ప్రకృతి వైపరీత్యాలకు రైతన్న తీ వ్రంగా నష్టపోతుండగా, ఆరుగాలం పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక అప్పుల పాలవుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతిన్న పంటలకు రైతులను ఆదుకునేందుకు ఫసల్ బీమా పథకం, పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించేం దుకు పలు పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్నప్పటికీ అన్న దాతలకు మాత్రం ఎలాంటి ప్రయోజనలు చేకూరడం లేదు. ఈ పథకాలకు ప్రభుత్వాలు మధ్యంతరంగా నిలిపివేయడంతో అమలుకావడం లేదు. పంట నష్టం సర్వేలతోనే అధికారులు సరిపెడుతున్నారు. ఇవి కేవలం కాగితాలకే పరిమితం అవుతున్నాయి. నష్టం పరిహారం సకాలంలో అందించకపోవడంతో రైతులకు అప్పులే మిగులుతున్నాయి.

## క్రమంగా పెరుగుతున్న గోదావరి

భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపోర్లుతున్నాయి. పలు ప్రాజెక్టులకు వరద పోటెత్తింది. దీంతో ప్రాజెక్టులన్నీ నిండుకుండలా మారాయి. ఈ క్రమంలో ఆయా ప్రాజెక్టుల పరిధిలోని లోతట్టు ప్రాంతాలను అధికారులు అప్రమత్తం చేశారు.

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుపోతోంది. ప్రస్తుతం గోదావరి నీటిమట్టం 31.5 గా ఉంది. దీంతో అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను అలర్ట్ చేశారు. మరోవైపు తాళిపేరు ప్రాజెక్టు 20 గేట్లు ఎత్తి 66,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాలైన తాళి పేరు ప్రాజెక్టు, పెరూరు వైపు నుంచి వరద నీరు రావడంతో నది నీటిమట్టం ఇంకా పెరుగుతుందని అధికారులు తెలుపుతున్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు జాలారులు నదివైపు వెళ్లొద్దని జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ హెచ్చరికలు జారీ చేశారు. జిల్లాతో పాటు ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి వరద పోటెత్తింది. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు. వరద ఇలాగే కొనసాగితే లోతట్టు ప్రాంతాలకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం కనిపిస్తుంది. అల్పపీడన ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వచ్చే నాలుగు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ విభాగం హెచ్చరించింది.

## నిరుద్యోగ భృతిపై మోసం

హైదరాబాద్: నిరుద్యోగ భృతి ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో భాజపా యువ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగ మహా ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. రేవంత్‌రెడ్డి జాబ్ క్యాలెండర్ విషయమే మరిచిపోయారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలన్నీ విస్మరించారన్నారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేకతను కూడగట్టుకుంటోందని.. ఆ పార్టీకి ప్రజలందరూ స్వస్తి చెబుతారన్నారు. 'కాంగ్రెస్ నాయకులు ఎవరికి దొరికినంత వారు దోచుకుంటున్నారు. రాష్ట్రంలో విస్తారంగా అవినీతి కొనసాగుతోంది. అధికారాన్ని దుర్వినియోగం చేయడంలో మాత్రమే రాష్ట్రంలో మార్పు వచ్చింది. హామీలన్నీ వంద రోజుల్లో ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలి. గతంలో ప్రజల తీర్పును కాలరాసి కేసీఆర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను భారాసలో చేర్చుకున్నారు. రాష్ట్రంలో కేవలం జెండా మాత్రమే మారింది. ప్రజావాణి వినిపించడంలో భాజపా కృషి చేస్తుంది. గ్రూప్ 1 మెయిన్స్‌కు 1:50 కాకుండా 1:100 నిష్పత్తిలో ఎంపిక చేయాలి. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు గ్రూప్ 2లో 783 పోస్టులను 2000కు పెంచాలి. 1365 గ్రూప్ 3 పోస్టులను 3000కు పెంచాలి. హామీ ఇచ్చినట్లుగా 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వెంటనే చేపట్టాలి. మెగా డీఎస్సీలో భాగంగా 25 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలి. నిరుద్యోగులకు వెంటనే రూ.4 వేల భృతిని విడుదల చేయాలి' అని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## కరెంట్ కోతల ఆందోళనలుచూసి ఎన్నాళ్లయ్యింది

ఫోటోను షేర్ చేస్తూ..కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్:** తెలంగాణ వ్యాప్తంగా కరెంట్ కోతలు కొనసాగుతూనే ఉన్నాయని,

ప్రతి రోజు, ప్రతి గంట.. రాష్ట్రంలో ఏదో ఒక ప్రాంతంలో కరెంట్ కోతలు ఉంటున్నాయని బిఆర్ఎస్ విమర్శిస్తోంది. కరెంట్ కోతలు నిరంతరం విధిస్తుండడంతో అటు అన్నదాతలు, ఇటు ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. రైతులు సబ్ స్టేషన్లను ముట్టడిస్తూ తమ నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ కోతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. తెలంగాణలో కరెంట్ కోసం అన్నదాతల నిరసనలు చూసి యుగాలు అయిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఇది మార్పు మహత్యం అని ఆయన విమర్శించారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం చేగుంట గ్రామంలో గత కొద్ది రోజుల నుంచి కరెంట్ కోతలు ఉన్నాయి. కరెంట్ కోతల కారణంగా వ్యవసాయ పనులు చేసుకోలేకపోతున్నామని నిరసన వ్యక్తం చేస్తూ నిన్న సబ్‌స్టేషన్‌కు తాళం వేశారు రైతులు. కరెంట్ సరిగా లేకపోవడం కారణంగా గ్రామంలో కూడా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతులు మండిపడ్డారు. రైతుల ధర్నాకు సంబంధించిన దృశ్యాలను కేటీఆర్ తన ట్వీట్‌కు ట్యాగ్ చేశారు.

## కవి జయరాజ్‌కు గుండెపోటు

### హుటాహుటిని నిమ్స్‌కు తరలింపు

హైదరాబాద్: ప్రముఖ కవి, పాటల రచయిత, గాయకుడు జయరాజ్ గుండెపోటుకు గురయ్యారు. శనివారం ఉదయం ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు నిమ్స్ దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని చెప్పారు. కాగా, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో ఆయన చేసిన కృషికిగాను తెలంగాణ ప్రభుత్వం 2023లో కాళోజీ నారాయణ రావు అవార్డును అందించిన విషయం తెలిసిందే. మహబూబాబాద్ జిల్లాకు చెందిన జయరాజ్ చిన్నప్పటి నుంచి ఎన్నో కష్టాలను అనుభవించి కవిగా పేరు తెచ్చుకున్నారు. మహబూబాబాద్ మండలం గుమ్మనూర్ లో గోడిశాల చెన్నమ్మ, గొడిశాల కిష్టయ్య దంపతులకు జన్మించారు జయరాజ్. పేద దళిత కుటుంబానికి చెందిన జయరాజ్ వివక్షత లేని సమ సమాజం కోసం తన సాహిత్యాన్ని సృజించారు. పేద దళితకుటుంబానికి చెందిన జయరాజ్ వివక్షలేని సమాజం కోసం కృషి చేశారు. బుద్ధుడి బోధనల ప్రభావం ఆయనపై చాలానే ఉంది. అంబేద్కర్ రచనలతో స్ఫూర్తి పొందారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్లలెల్లో తిరుగుతూ తన ఆటపాటల ద్వారా ప్రజల్లో ఉద్యమ భావజాలాన్ని రగిలించారు. ప్రకృతి గొప్పతనాన్ని వర్ణిస్తూ, పర్యావరణ పరిరక్షణ కోసం పలు పాటలు రాశారు. మనిషికీ, ప్రకృతికీ ఉన్న అవినాభావ సంబంధాన్ని తన సాహిత్యం ద్వారా సున్నితంగా విశ్లేషించారు. తెలంగాణ ఉద్యమ కాలంలో పల్లె పల్లెనా తిరుగుతూ.. తన ఆట పాట గానం ద్వారా ప్రజల్లో తెలంగాణ సాంస్కృతిక ఉద్యమ భావజాలాన్ని రగిలించిన ప్రజా కవిగా జయరాజు కృషి చేశారు. ప్రకృతి గొప్పతనాన్ని వర్ణిస్తూ, పర్యావరణ పరిరక్షణ కోసం పలు పాటలు రచించారు. మనిషికీ ప్రకృతికీ ఉన్న అవినాభావ సంబంధాన్ని తన సాహిత్యం ద్వారా సున్నితంగా విశ్లేషించారు. ఈ మేరకు వారు ముద్రించిన పలు పుస్తకాలు ప్రజాదరణ పొందాయి. తెలంగాణ బతుకు ఛిద్రమైన జాడను తన పాటల్లో పట్టి చూపించిండు. ప్రజల గుండెల్లో చిరకాలం యాదికుండే పాటలు రాసిన జానపద గాయకుడు విప్లవోద్యమంలో అనేక పాటలకు ప్రాణం పోసిండు. పోరాడకుంటే బతుకు మారదని, తన పాటలు, రచనల ద్వారా ప్రజలకు దోపిడి మర్మాన్ని విప్పి చెప్పిండు. జయరాజు పాటలు ప్రజలను ఉద్యమ బాటలో

నడిపిస్తయి. జోలాలీ పాటవింటే వందకోట్ల భారతీయుల కన్నీటి కథ మన కండ్లముందు ఉంటది. తన స్నేహితుడు చేరాల కనుమూసినపుడు ' నిన్నెట్టా మరిచిపోదును చేరాల..' అన్న పాట ఆయన కలం నుంచి పట్టిన తొలి పల్లవి. కాచినపల్లి ఎన్‌కౌంటర్ పై రాసిన పాట ప్రతి హృదయాన్ని కదిలించింది. ఆకలి, పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, పాలకుల పీడనవంటి దీర్ఘకాలిక సమస్యలను పాటగట్టి జనాన్ని పోరుబాట పట్టిచ్చిండు. అడవిలో అన్న సినిమాకు హైలెట్‌గా నిలిచిన 'వందనాలమ్మ పాట' జయరాజ్ కలం నుంచి వచ్చిందే. దండోరా సినిమాలోని కొండల్లో కోయిల పాటలు పాడాలి అనే పాటను జయరాజ్ రాశారు.

## మా ఎమ్మెల్యేలను బెదిరించి చేర్చుకుంటున్నారు

**హైదరాబాద్:** మా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను భయపెట్టి కాంగ్రెస్‌లో

చేర్చుకుంటున్న సంగతి గురించి గవర్నర్‌కు తెలిపామని భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పార్టీ ఫిరాయింపులు, నిరుద్యోగులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చని అంశంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. కెటిఆర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు శనివారం గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిశారు. ఆ తర్వాత కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో రాజ్యాంగంపై జరుగుతున్న దాడి, ఇతర అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. నిరుద్యోగ యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా తుంగలో తొక్కుతోందో ఆయనకు వివరించాం. హామీలు అమలు చేయాలన్న విద్యార్థుల అరెస్టులు, అక్రమ కేసులతో భయానక వాతావారణం సృష్టిస్తున్నారని వివరించామని అన్నారు. గవర్నర్ చాలా సీరియస్‌గా ఈ అంశాలపై స్పందించారు. హోంశాఖ కార్యదర్శిని పిలిచి వివరాలు అడుగు తానని చెప్పారు. మా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను భయపెట్టి కాంగ్రెస్‌లో చేర్చుకున్న సంగతి గురించి గవర్నర్‌కు తెలిపాం. దీనిపై న్యాయపోరాటం చేస్తున్నామని.. స్పీకర్‌కు కూడా ఫిర్యాదు చేశామని ఆయనకు వివరించాం. ప్రొటోకాల్ ఉల్లంఘనలను కూడా గవర్నర్‌కు వివరించాం అని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు భారాస అండగా అండగా ఉంటుందని.. వారికి కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చే వరకూ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కేటీఆర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. రెండు ముఖ్యమైన అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లాం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ నేతలు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను గవర్నర్‌కు తెలియజేశాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను తుంగలో తొక్కుతూ.. అప్రజాస్వామికంగా విద్యార్థులపై దాడులు చేసి కేసు పెడుతున్నట్లు చెప్పాం. విద్యార్థులపై లాఠీలు ఝులిపిస్తూ.. భయానక వాతావరణం సృష్టించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను యూనివర్సిటీల్లో చూస్తున్నామని కేటీఆర్ తెలిపారు. మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. జాబ్



క్యాలెండర్ అని చెప్పి ప్రకటనలు ఇచ్చారని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లాం. కేసీఆర్ హయాంలో జారీ అయిన గ్రూప్-1, 2, 3 నోటిఫికేషన్లు రద్దు చేసి పోస్టుల సంఖ్య పెంచుతామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని గుర్తు చేశామన్నారు. ఇప్పటి వరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదు. ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని గవర్నర్‌కు చెప్పామని కేటీఆర్ తెలిపారు. మెగా డీఎస్సీ అని చెప్పారు కానీ వేయలేదు. నిరుద్యోగ భృతి 4 వేలు ఇవ్వలేదు. అన్నింటికి మించి సిటీ సెంట్రల్ లైబ్రరీలో చదువుకుంటున్న విద్యార్థులను బయటకు ఈడ్చుకొచ్చి హింసించారు. ఉస్మానియా యూనివర్సిటీలో హాస్టల్ ఉన్న విద్యార్థులపై దాడులు చేసి అప్రజస్వామికంగా వ్యవహరించారని వివరించి చెప్పామని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎమ్మెల్సీలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్ మీద గెలిచి.. కాంగ్రెస్ టికెట్‌పై పార్లమెంట్‌కు పోటీ చేశారు. మ్మెల్యేలు, ఎమ్మెల్సీల ప్రొటోకాల్ విషయంలో జరుగుతన్న అగౌరవాన్ని కూడా వివరించాం. ఈ విషయంలో ప్రభుత్వానికి లేఖ రాస్తానని గవర్నర్ చెప్పారు. ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం వాటిల్లకుండా చూస్తానని చెప్పారు. భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని గవర్నర్ చెప్పారు. ఇక్కడితో ఆగకుండా రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉండే పెద్దలను కలిసి కాంగ్రెస్ పార్టీ నిర్వాకాన్ని వివరిస్తాం. రాష్ట్రపతిని కూడా కలిసి చెబుతాం. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునే వరకు, గ్రూప్-2, 3 పోస్టులు పెంచేదాకా, నిరుద్యోగులకు న్యాయం జరిగేదాకా

ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని, నిరుద్యోగులకు అండగా ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, తలసాని, కాలె వెంకటేశ్,గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ తదితరులు కెటిఆర్ వెంట ఉన్నారు.

## రాజకీయాల్లో ఎన్టీఆర్ ట్రెండ్ సెట్టర్

> సంకీర్ణ రాజకీయాలకు ఆయనే ఆద్యుడు
>
> కకష్టాన్ని నమ్ముకునే వారే కమ్మవారు
>
> అమ్మలాగా అన్నం పెట్టి ఆదుకునే గుణం వారి సొంతం
>
> తెలంగాణ అభివృద్ధిలో వారు భాగస్వామ్యం కావాలి
>
> వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్న సిఎం రేవంత్

**హైదరాబాద్:** రాజకీయాల్లో ఎన్టీఆర్ ఒక బ్రాండ్ క్రియేట్ చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ వల్లనే దేశంలో సంకీర్ణ రాజకీయ శకం మొదలయ్యిందన్నారు. ఎందరో ఆయన నీడలో రాజకీయ జీవితాన్ని పొందారని అన్నారు. హైదరాబాద్ కమ్మ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ దేశానికి సంకీర్ణ రాజకీయాలు ఎన్టీఆర్ నేర్పించారన్నారు. ఎంతో మందిని రాజకీయాలకు పరిచం చేసిన వ్యక్తని అన్నారు. పది మందిని ఆదుకునే గుణం కమ్మవారిదని చెప్పారు. వారు తమ సమజమైన ఆదుకునే గుణంతో మరింతగా ఎదగాలని ఆకాక్షించారు. తెలంగాణ అభివృద్ధిలో హైదరాబాద్ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కష్టపడేతత్వం కమ్మవారిదని, అలా ఎన్నో రంగాల్లో వారు రాణిస్తున్నారని అన్నారు. కమ్మల కష్టానికి గుర్తింపు అవకాశాలు ఉంటాయని చెప్పారు. మట్టి నుంచి బంగారం తీయగల శక్తి కమ్మవారికి ఉందన్నారు. ఎన్టీఆర్ రాజకీయాలకు ఒక బ్రాండ్ అని లీడర్ షిప్ కు ఒక కబ్రాండ్ అని అని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కమ్మ కుటుంబ సభ్యులను ఒక్క దగ్గర చేర్చడం అభినందనీయమని

సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 2023కి ముందే ఈ కార్యక్రమం ఏర్పాటు చేయాలని సంకల్పించినట్లు చెప్పారు. ఎన్నికలు, ఇతర పరిస్థితుల వల్ల సాధ్యం కాలేదని పేర్కొన్నారు. 90 రోజుల్లోనే అన్ని ఏర్పాట్లు చేసుకుని కార్యక్రమం ఘనంగా నిర్వహించారని వివరించారు. కమ్మ అంటే అమ్మలాంటి వారు. అమ్మ బిడ్డ కడుపు చూస్తుంది.. కమ్మవారు వ్యవసాయం చేసి పదిమందికి అన్నం పెడుతున్నారు. వారు కష్టపడి పంటలు పండించాలి.. పది మందికి ఉపయోగపడాలి అనుకుంటారు. నేను ఎక్కడ ఉన్నా... వారు నన్ను ఎంతో ఆదరిస్తారు. అనర్గళంగా మాట్లాడటం ఎన్టీఆర్ నుంచే నేర్చుకున్నా. ఎన్టీఆర్ లైబ్రరీలో చదివిన చదువు మమ్మల్ని ఉన్నత స్థానాలకు తెచ్చిందని రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో కమ్మ భవనం నిర్మాణానికి కేటాయించిన భూమిని అప్పగిస్తామని, నిర్మాణానికి సహకరిస్తామని చెప్పారు. వివిధ వ్యాపార, వాణిజ్య రంగాల్లో ఉన్నవారు హైదరాబాద్ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు.ఇకపోతే జాతీయ రాజకీయాల్లో తెలుగువారి ప్రభావం పూర్తిగా తగ్గిందని అన్నారు. జైపాల్ రెడ్డి, వెంకయ్యనాయుడు లాంటి వారు లేకపోవడంతో లోటు కొట్టొచ్చినట్లు కనిపిస్తోందన్నారు. ఈ విషయంలో తెలుగు వారంతా నాయకత్వం కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి, సీతక్క, నటుడు మురళీ మోహన్ , కాంగ్రెస్ నేత జటట్ఇ కుసుమ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

ప్రభాకర్ రావు, శ్రవణ్ రావులను హాజరు పర్చండి

నాంపల్లి కోర్టు సంచలన ఆదేశాలు

**హైదరాబాద్:** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఏ1 ప్రభాకర్ రావు (ఎస్ఐబీ మాజీ చీఫ్), ఏ6 శ్రవణ్ రావును కోర్టులో హాజరుపర్చాలని నాంపల్లి కోర్టుఆదేశాలు జారీసింది. ఇప్పటికే ప్రభాకర్ రావుపైన కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రభాకర్‌రావు వర్చువల్‌గా విచారణకు హాజరవుతారని కోర్టు దృష్టికి దర్యాప్తు బృందం తీసుకెళ్లింది. అయితే ప్రభాకర్ రావు విజ్ఞప్తిని న్యాయస్థానం తిరస్కరించింది. వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. ఇంటర్ పోల్ ద్వారా ప్రభాకర్ రావు, శ్రవణ్ రావులను పోలీసులు ఇండియాకు రప్పించే ప్రయత్నం చేస్తున్నారు. అమెరికాలో ప్రభాకర్ రావు ఉన్నట్లు సిట్ బృందం గుర్తించింది. శ్రవణరావు ఆచూకీని మాత్రం దర్యాప్తు బృందం ఇప్పటికీ కనుకోలేకపోయినట్లు తెలుస్తోంది. కాగా... ఈ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావే ప్రధాన నిందితుడిగా పోలీసులు తేల్చిన విషయం తెలిసిందే. ప్రభాకర్ రావు కనుసన్నల్లోనే ఫోన్ టాపింగ్ జరిగిందని పోలీసులు నిర్ధారించారు. ఫోన్ టాపింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత ప్రభాకర్ రావు విదేశాలకు వెళ్లిపోయాడు. దీంతో ప్రభాకర్ రావు ఆచూకీ కోసం పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. లుక్ అవుట్ నోటీసులకు స్పందన లేకపోవడంతో.. రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేశారు. మరోవైపు ఈ కేసులో ప్రణీత్ రావు ఏ2గా, తిరుపతన్న ఏ3గా, భుజంగరావు ఏ4గా, రాధాకిషన్ రావు ఏ5గా ఉన్నారు. ఈ నలుగురు ఇటీవల దాఖలు చేసిన మ్యాండేటరీ బెయిల్ పిటిషన్‌ను నాంపల్లి క్రిమినల్ కోర్టు తిరస్కరించిన విషయం తెలిసిందే. లాగే ఈ కేసులో అరెస్ట్ అయి చంచల్‌గూడ జైలులో ఉన్న టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావుపై మరో కేసు నమోదు అయ్యింది. నాంపల్లి కోర్టులో పీటీ వారెంట్‌పై పోలీసులు రిమాండ్ చేశారు. యజమానిని కిడ్నాప్ చేసి క్రియా హెల్త్ కేర్ సంస్థలో కోట్ల విలువైన షేర్లను నలుగురు డైరెక్టర్ల మీదకు బలవంతంగా బదిలీ చేయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు చెన్నుపాటి వేణుమాధవ్ ఫిర్యాదుతో కేసు నమోదు అయ్యింది. ఈ క్రమంలో రాధాకిషన్‌రావుతో పాటు మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు సహా చంద్రశేఖర్, కృష్ణ, గోపాల్, రాజ్, రవి, బాలాజీలపై కేసు నమోదు అయ్యింది.

## కులగణనతో సామాజిక విభజన

### ఇందులో అనేక సమస్యలు ఉన్నాయి కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్

**న్యూఢిల్లీ:**దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన నిర్వహించాలని కొంతకాలంగా ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కులగణనపై స్పందించిన కేంద్రమంత్రి, లోక్ జనశక్తి పార్టీ అధ్యక్షుడు చిరాగ్ పాసవాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దేశంలో కులగణన చేపట్టేందుకు మద్దతు తెలిపారు. కానీ, అది సమాజ విభజనకు దారి తీస్తుందన్నారు. అందుకే వాటి సమాచారాన్ని బహిర్గతం చేయకూడదని హెచ్చరించారు. కమ్యూనిటీ ఆధారిత అభివృద్ధి పథకాలకు నిధుల కేటాయింపు కోసం నిర్దిష్ట డేటా తరచూ అవసరమవుతోంది. న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడంలోనూ ఈ డేటా ఉపయోగపడుతుంది. కులగణన నిర్వహించడం అవసరమే. కానీ, ఇందులో కొన్ని సమస్యలు కూడా ఉన్నాయి. కులగణన ద్వారా సమాజంలో విభజన ఏర్పడే అవకాశం లేకపోలేదు. కాబట్టి ఈ గణాంకాలను బయటకు తీసుకురావడం అంత మంచిది కాదు. ఎన్డీయే ప్రభుత్వంలో దీనిపై ఇప్పటివరకు ఎలాంటి చర్చ జరగలేదని విలేకరుల సమావేశంలో చిరాగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని భారత్‌లో చూడవచ్చు. కానీ, ఛత్తీస్‌గఢ్‌లో కనుక చూస్తే కొందరు ఆదివాసీలు వీటికి దూరంగా ఉంటున్నారు. అలాంటి వారందరినీ ఒకే గొడుగు కిందకి తీసుకురాగలమా? కులగణనకు ముందు ఒక ముసాయిదా తీసుకురావాల్సి ఉంటుంది. దాన్ని పరిశీలించి కీలక నిర్ణయాలు తీసుకోవాలి. అది వచ్చేంత వరకు నేనేమీ మాట్లాడలేను అని పేర్కొన్నారు. దేశంలో కులగణన చేపట్టాలని ప్రతిపక్షాలు కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై ఇంతవరకు మోదీ సర్కార్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ క్రమంలోనే కేంద్రమంత్రి చిరాగ్ పాసవాన్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

## గవర్నర్‌ను అవమానించిన చరిత్ర మీది

హైదరాబాద్: బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర గవర్నర్‌ను కలవడానికి సిగ్గుండాలని బీఆర్ఎస్‌పై ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అసలు గవర్నర్ వ్యవస్థపై బీఆర్ఎస్ నాయకులకు నమ్మకం ఉందా..? అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు అప్పటి గవర్నర్‌ను అనేక విధాలుగా కేసీఆర్ అవమానించారని తెలిపారు. అలాంటి బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు రాజ్యాంగాన్ని రక్షించాలని గవర్నర్ ఆశ్రయించడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. తెలంగాణలో రాజ్యాంగంపై దాడి జరుగుతుందని బీఆర్ఎస్ నేతలంటున్నారు.. తెలంగాణలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాకుండా కల్వకుంట్ల రాజ్యాంగాన్ని అమలు చేసింది మీరు కాదా..? అని బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. రాజ్యాంగానికి ఏ మాత్రం విలువ ఇవ్వకుండా నియంతృత్వ పాలన చేసింది మీరు కాదా.. తెలంగాణలో రాజ్యాంగాన్ని ఖననం చేసింది కల్వకుంట్ల కుటుంబం కాదా..? అని ప్రశ్నించారు. ఫిరాయింపులకు పాల్పడుతున్నారని రాజ్ భవన్ ముందు కేటీఆర్ గొంతు చించుకుంటున్నారని బీర్ల ఐలయ్య విమర్శించారు. పదేళ్ల పాటు ఆయన గొంతు ఎందుకు మూగబోయింది.. తెలంగాణలో ప్రతిపక్షాలే లేకుండా కేసీఆర్ చేయడానికి ప్రయత్నించినప్పుడు కేటీఆర్ మౌనవ్రతం పాటించారా..? అని ప్రశ్నించారు. ఫిరాయింపులపై గవర్నర్ కు ఫిర్యాదు చేయడానికి కేటీఆర్ కు సిగ్గు ఉందా..? అని ఐలయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను మంత్రులుగా అదే రాజ్ భవన్ లో ప్రమాణం చేయించినప్పుడు రాజ్యాంగం గుర్తుకు రాలేదా..? ప్రొటొకాల్ గురించి కేటీఆర్ తెగ గింజుకుంటున్నాడని వ్యాఖ్యానించారు. అధికార మదంతో ఆనాడు విర్రవీగి ఈనాడు రాజ్ భవన్ గేట్ ముందు హాహాకారాలు చేస్తున్నారని తెలిపారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎంపీలను కనీసం సెక్రటేరియట్?లోకి కూడా అనుమతివ్వకుండా అడ్డుకున్న చరిత్ర మీది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో భయానక వాతావరణాన్ని ప్రభుత్వం సృష్టించిందని కేటీఆర్ అంటున్నారు.. అధికారం పోగానే హైదరాబాద్ ఇమేజ్ ను డ్యామేజ్ చేయడానికి కేటీఆర్ కుట్రలు చేస్తున్నారని బీర్ల ఐలయ్య ఆరోపించారు. హైదరాబాద్ ప్రశాంతంగా ఉంది. నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. నిరుద్యోగుల డిమాండ్ల విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.. గ్రూప్ 2 పరీక్షను వాయిదా వేశాం? పోటీ పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని తెలిపారు. పదేళ్లలో నోటిఫికేషన్లు ఇవ్వకుండా నిరుద్యోగులను రోడ్ల మీదకు తీసుకువచ్చింది మీరు కాదా..? అని ప్రశ్నించారు. రైతులకు బేడీలు వేసిన చరిత్ర కేసీఆర్?ది అని పేర్కొన్నారు.


వేగుచుక్క
TELUGU DAILY NEWS
3
ఆదివారం 21 జులై 2024

# నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం వల్లే రోడ్డు ప్రమాదాలు.






**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జూలై 20**

నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతోమంది నిండు ప్రాణాలను కోల్పోతున్నారని నిజామాబాద్ జిల్లా జడ్జి సునీత కుంచాల, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా పోలీస్ శాఖ సౌజన్యంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం 'మైనర్ డ్రైవింగ్ - డ్రంకెన్ డ్రైవింగ్' అంశంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా జడ్జి సునీత కుంచాల ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన ఆవశ్యకత గురించి నొక్కి చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అతివేగంగా వాహనాలు నడపడం, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం వంటివి రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అవుతున్నాయని అన్నారు. ముఖ్యంగా 18 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారని, వ్యక్తిగతంగా వారి కుటుంబాలతో పాటు సమాజానికి, ఇతరులకు కూడా తీరని నష్టం చేకూరుస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. దీనిని నివారించాలని లక్ష్యంతో ప్రభుత్వం కఠిన చట్టాలను అమలులోకి తెచ్చిందని, మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులు కూడా నేరస్థులుగా పరిగణించబడతారని అన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే, వారితో పాటు తల్లిదండ్రులకు కూడా చట్ట ప్రకారం మూడేళ్ళ కారాగార శిక్ష, రూ. 25 వేల వరకు జరిమానా విధించబడుతుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎట్టి పరిస్థితుల్లోనూ మైనర్లకు వాహనాలు నడిపేందుకు అనుమతించకూడదని, లైసెన్స్ కలిగిన వారు మాత్రమే వాహనాలు నడపాలని జిల్లా జడ్జి హితవు పలికారు. నేటి సమాజంలో అత్యధికమంది యువకులు, విద్యార్థులు రోడ్డు ప్రమాదాల గురించి ఏమాత్రం పట్టింపులేనితనం ప్రదర్శిస్తున్నారని, ఇష్టారీతిన వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారకులై నిండు ప్రాణాలు కోల్పోతున్నారని, ఎదుటివారికి నష్టం చేకూరుస్తున్నారని అన్నారు. మనపై కుటుంబం ఆధారపడి ఉందని గమనించి బయటికి వెళ్ళేటప్పుడు తప్పక ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, లేకుంటే



**జిల్లా జడ్జి సునీత కుంచాల.**

**మైనర్లకు వాహనాలు ఇచ్చి శిక్షలకు గురికావద్దని తల్లిదండ్రులకు హితవు.**

**న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు.**

**పంద్రాగస్టు తర్వాత హెల్మెట్ నిబంధనను తప్పనిసరి చేస్తాం : సీ.పీ వెల్లడి.**

కుటుంబం మొత్తం చిన్నాభిన్నం అయ్యే దుస్థితి నెలకొంటుందని అన్నారు. దేశంలో రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతి గంటకు 19 మంది మృత్యువాత పడుతున్నారని, ఇది ఎంతో ఆందోళన కలిగించే అంశమని, ప్రతి ఒక్కరు దీని గురించి ఆలోచించాలని హితవు పలికారు. ఎన్ని చట్టాలు వచ్చినా, ప్రభుత్వ యంత్రాంగం ఎంతటి కఠిన చర్యలు చేపట్టినా కూడా, మీ ఆలోచనా విధానాల్లో మార్పు రానంతవరకు రోడ్డు ప్రమాదాల పరిస్థితిలో మార్పు రాదని అభిప్రాయపడ్డారు. సమాజానికి మనవంతు బాధ్యతగా మనం ఏం చేస్తున్నాం అనేది ప్రతి ఒక్కరు ఎవరికివారు ఆత్మవిమర్శ చేసుకుని విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అతివేగం అనర్ధదాయకమని జాగ్రత్తలు సూచించారు. రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోతే, తల్లిదండ్రులు పడే మానసిక క్షోభ వర్ణనాతీతమని అన్నారు. ఒకవేళ ప్రాణాలు దక్కినా, తీవ్ర గాయాలపాలై అచేతనావస్థకు చేరితే ఇతరులపై ఆధారపడి జీవితం గడపాల్సి రావడం ఎంతో దుర్భరంగా ఉంటుందని గుర్తు చేశారు. ప్రమాదాలను నిలువరించేందుకు ప్రతిఒక్కరు బాధ్యతాయుతంగా వాహనాలు నడుపుతూ, తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని హితవు పలికారు. ఇకపై మైనర్లు వాహనాలు నడిపినా, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోయినా చట్ట ప్రకారం కఠిన శిక్షలు అమలయ్యేలా చూస్తామన్నారు.

పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీటు బెల్టు ధరించకపోవడం, అతివేగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, ఓవర్ టేక్ చేయడం, సెల్ ఫోన్ డ్రైవింగ్, సామర్థ్యానికి మించి ఎక్కించుకోవడం, రాంగ్ సైడ్ వెళ్లడం, సిగ్నల్స్ జంప్ చేయడం తదితర కారణాల వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నిజామాబాద్ జిల్లాలో గడిచిన ఏడాదిన్నర కాలంలోనే రోడ్డు ప్రమాదాలలో 550 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. దేశవ్యాప్తంగా చూస్తే, 2018 నుండి 2022 వరకు ఐదేళ్ల వ్యవధిలో 22.15 లక్షల వరకు రోడ్డు ప్రమాద ఘటనలు చోటుచేసుకుని, 8 లక్షల మంది అకాలమరణం చెందారని సీ.పీ ఆవేదన వెలిబుచ్చారు. జిల్లా కేంద్రమైన నిజామాబాద్ నగర జనాభా మూడున్నర లక్షలు కాగా, ప్రమాదాలలో అంతకు రెట్టింపు సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారంటే రోడ్డు ప్రమాదాల తీవ్రత ఏ స్థాయిలో ఉందనేది అర్ధం చేసుకోవచ్చని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం ప్రమాదాల పెచ్చుమీరేందుకు కారణమవుతోందని ఆక్షేపించారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైతే కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అన్నారు. ముఖ్యంగా యువత అతివేగాన్ని మానుకోవాలని, రోడ్డు భద్రతా నిబంధనలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎంతో అప్రమత్తతో వాహనాలు నడపాలని సీ.పీ హితవు పలికారు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపే వారు విధిగా సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. వచ్చే ఆగస్టు 15 తరువాత హెల్మెట్ నిబంధనను తప్పనిసరి చేస్తామని, హెల్మెట్ ధరించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సులో టీ.జీ.ఎస్.పీ 7వ బెటాలియన్ కమాండెంట్ రోహిణీ ప్రియదర్శిని, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ఆర్మూర్ ఏ.సీ.పీ బస్వారెడ్డి, బోధన్ ఏ.సీ.పీ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ఆయా కళాశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దాం.

**- ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి.**

**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, జులై 20:**



రాజకీయాలు ఎన్నికల వరకు మాత్రమేనని, ఇప్పుడు అభివృద్ధి కోసం అందరూ నాయకులు కలిసిరావాలి అని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయం ముఖ ద్వారం శనివారం మున్సిపల్ చైర్మన్ లావణ్య, మున్సిపల్ కౌన్సిలర్ ల తో కలిసి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆర్మూర్ పట్టణ అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా నాయకులను కలిసి అభివృద్ధి కోసం నిధులు అడుగుతాననీ అన్నారు. మున్సిపల్ చైర్మన్ తో కలిసి అభివృద్ధి కి సహకరిస్తాను అని తెలిపారు. అనంతరం రైతుబజార్ ను పరిశీలించి వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## దారుగల్లి హైస్కూల్ సమస్యలు పరిష్కారించాలి.

**- విద్యార్థులతో కలిసి పి డి ఎస్ యూ ధర్నా.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జులై 20:**




నగరంలోనీ హామల్ వాడిలో గల దారుగల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం దారుగల్లి ప్రభుత్వ హై స్కూల్ వద్ద పిడిఎస్ యూ ఆద్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలిపారు.ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ, వర్షాకాలం వచ్చిందంటే స్కూల్ ప్రాంగణంలో వర్షపు నీరు చేరి డ్రెయినేజీ కి వెళ్ళే దారి లేక అక్కడే నీళ్లు జమైతున్నాయని అన్నారు. విద్యార్థులు క్లాస్ రూమ్స్ లోకి వెళ్ళాలన్న బయటకు రావాలన్న నీటి లో నుండి నడుచుకుంట రావాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న వర్షానికే ఇలా ఉండే పెద్ద వర్షం పడితే పరిస్థితి ఊహించలేనిదని, స్కూల్ బిల్డింగ్ కి నీటి తడి వస్తుందని, 100 కి పైగా ఉన్న విద్యార్థులకు 2 బాత్రూమ్ లు మాత్రమే ఉన్నాయని అన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కూడా విజిట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ నాయకులు మనోజ్, భరత్, అనిల్, రామ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళ అంటేనే "మహాశక్తి".

**- రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, కామారెడ్డి అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జే. శ్రీనివాసరావు.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, జులై 20:**



మహిళ అంటే సామాన్య వ్యక్తి కాదని మహాశక్తి అని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, కామారెడ్డి అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జే. శ్రీనివాసరావు అన్నారు. శనివారం కామారెడ్డి పట్టణంలోని కళాభారతి లో జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ సహకారంతో మహిళా, శిశు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ మహిళా సాధికారత పై(నారీశక్తి) ఆశ వర్కర్లు, అంగనవాడి టీచర్లు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, కళాశాలల విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జే.శ్రీనివాసరావు మహిళలు, విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, స్వయం సహాయక మహిళా సంఘ సభ్యులు నిర్వహిస్తున్నది ఉద్యోగ బాధ్యతలు మాత్రమే కాదని వారు చేసేది ఒక సామాజిక సేవ అని అన్నారు. స్త్రీ అంటే ఒక సామాన్య వ్యక్తి కాదని ఒక మహాశక్తి అని చైతన్యవంతమైన మహిళా ఉండే ఇల్లు ఆదర్శవంతంగా ఉంటుందని, ఇల్లు ఆదర్శవంతమైనప్పుడే గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్రం దేశం ప్రపంచానికి ఆదర్శంగా తయారవుతుందని అన్నారు. భారతదేశం ప్రపంచంలో సముచిత స్థానం పొందాలంటే మహిళల ద్వారా ఇంటి నుండే చైతన్యం రావాలని అన్నారు. భారత రాజ్యాంగంలో లింగం, కులం, మతం, భాష లాంటి ఎలాంటి భేదం లేకుండా పురుషులతో పాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించిందని, మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని అన్నారు. మహిళల సంక్షేమం కోసం గృహహింస నిరోధక చట్టం, పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం, వరకట్న నిషేధ చట్టం, పోక్సో చట్టం తదితర చట్టాలను తీసుకువచ్చారని అన్నారు. గతంలో ఏమన్నా సమస్యలు ఉంటే కుల సంఘాలు, గ్రామ పెద్దలు పరిష్కరించడంతో పోలీస్ స్టేషన్లు, కోర్టుల వరకు కేసులు ఎక్కువగా వచ్చేవి కావు. కానీ ఇప్పుడు 100 సంవత్సరాలు పని చేస్తే తప్ప పరిష్కారం కానన్ని కేసులు కోర్టులో పెండింగ్లో ఉన్నాయని అన్నారు. 1987లో న్యాయ సేవ సాధికార సంస్థ చట్టాలను తీసుకువచ్చారని ఎలాంటి ఖర్చు లేకుండా అన్ని రకాల కేసులను మండల మరియు జిల్లాస్థాయి న్యాయ సాధికార సేవల సంస్థకు ఫిర్యాదు చేసి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని అన్నారు. న్యాయ సేవ సాధికార సంస్థను సంప్రదిస్తే సమస్య పెద్దది కాకుండా పరిష్కారం సులువు అవుతుందని అన్నారు. విద్యార్థి జీవితం చాలా



విలువైనదని సెల్ఫోన్లకు బానిస కాకుండా ఐఎస్ఐ, ఐపీఎస్ లాంటి ఉన్నతాధికారాన్ని స్ఫూర్తిగా తీసుకొని కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని సూచించారు. తన స్వగ్రామం కామారెడ్డి పట్టణానికి సమీపంలో ఉందని నేను విద్యార్థి దశలో ఉన్నప్పుడు కామారెడ్డి పట్టణం విద్యా, వైద్యం, వ్యాపారం రంగాలలో ఉన్నతంగా ఉండడం గమనించానని అన్నారు.జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి డాక్టర్ సిహెచ్. విఆర్ఆర్. వర ప్రసాద్ మాట్లాడుతూ, అవసరం ఉన్న పేదలకు ఉచిత న్యాయ సేవలను అందించేందుకు జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ పనిచేస్తుందని అన్నారు.ఈ సంస్థ ద్వారా న్యాయ సేవా సదస్సుల ద్వారా చట్టాలపై అవగాహన కల్పించడం, పెండింగ్ కేసులను లోక్ అదాలత్ ల ద్వారా రాజి చేకూర్చి పరిష్కరించడం మరియు న్యాయ సహాయం అందించడం జరుగుతుందని అన్నారు.

జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక సావలంబన కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టిందని ముఖ్యంగా మహిళశక్తి కార్యక్రమం ద్వారా స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు 14 రకాల యూనిట్లతో కూడిన స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడం జరుగుతుందని, వితంతు మరియు వృద్ధాప్య పెన్షన్ ఇవ్వడం జరుగుతుందని, సఖి, డిసిపియు, తదితర కార్యక్రమాల ద్వారా గృహహింస గురైన మహిళలకు చేయూత అందించడం, బాల్య వివాహాలు జరగకుండా చూడడం, ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలలో మహిళలు లైంగిక వేధింపుల నివారణకు ఇంటర్నల్ కమిటీలను వేయడం జరిగిందని అన్నారు.

జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సింధు శర్మ మాట్లాడుతూ,

చట్టం మహిళల పక్షాన ఉందని గృహహింస,వరకట్న వేధింపు, లైంగిక దాడి, ఈవ్ టీజింగ్ లాంటి ఏ సమస్యలను మహిళలు ఎదుర్కొన్న న్యాయ సేవ సంస్థను సంప్రదిస్తే న్యాయం జరుగుతుందని అన్నారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని అన్నారు. మహిళల చైతన్య ద్వారానే సమాజం చైతన్యమవుతుందన్నారు.

కామారెడ్డి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ, మహిళలు, బాలలకు ఉచిత న్యాయ సేవ అందించడానికి బార్ అసోసియేషన్ సిద్ధంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో మొదటి అదనపు డిస్టిక్ అండ్ సెషన్స్ జడ్జి లాల్ సింగ్ శ్రీనివాస నాయక్, సీనియర్ సివిల్ జడ్జ్ నాగరాణి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ దీక్ష ఇతర న్యాయవాదులు, న్యాయస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# శ్రీవారిని దర్శించుకున్న శ్రీకాంత్ కుటుంబం

తిరుమల శ్రీవారిని ప్రముఖ సినీనటుడు శ్రీకాంత్ దర్శించుకున్నారు. శనివారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో కుటుంబసభ్యులతో కలిసి ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. తితిదే ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. గర్భాలయంలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న శ్రీకాంత్ కుటుంబానికి.. రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.






# పారితోషికం కన్నా...
## పాత్ర ముఖ్యం కరీనా కపూర్ స్పందన

బాలీవుడ్ నటి కరీనాకపూర్ అత్యధిక పారితోషికం తీసుకుంటున్న నటీమణుల జాబితాలో భాగం కావడంపై స్పందించారు. డబ్బు కంటే పాత్రకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. 'దాదాపు రూ.10 కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకూ సంపాదిస్తున్న తారల్లో నేనూ ఒకదాన్ని. ఈ స్థాయికి రావడానికి ఎంతో శ్రమించా. కేవలం పారితోషికాన్ని దృష్టిలో ఉంచుకుని సినిమాలు అంగీకరించను. పాత్ర నచ్చితే తక్కువ రెమ్యూనరేషన్‌కూ యాక్ట్ చేస్తా. అది పూర్తిగా నా అభిప్రాయం మీద ఆధారపడి ఉంటుంది. సినిమా ఎలాంటిది? అందులో నా పాత్ర ఏమిటి? అది సమాజంపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతుంది? అనే విషయాలను పరిగణలోకి తీసుకుంటా' అని చెప్పారు.అనంతరం తన భర్త సైఫ్ అలీఖాన్ గురించి మాట్లాడారు. 'పెళ్లి తర్వాత ఎంతో మారా. ఒకరికొకరు తోడుగా ఉండటం అర్థం చేసుకున్నాం. షూటింగ్స్ కారణంగా కలిసి టైమ్ స్పెండ్ చేయడానికి వీలు ఉండదు. ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ కొన్నిసార్లు ఒకరినొకరు చూసుకోవడానికి కూడా సమయం దొరకదు. వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలను బ్యాలెన్స్ చేయడం అంత సులభం కాదు. అందుకే వీలు దొరికినప్పుడు కలిసి సరదాగా గడపాలనుకుంటాం' అని తెలిపారు.'క్రూ'తో ఇటీవల విజయాన్ని అందుకున్నారు కరీనాకపూర్. బంగారం స్మగ్లింగ్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో జాస్మిన్ కోహ్లిగా కనిపించారు. ప్రస్తుతం ఈమె 'సింగం అగైన్' కోసం వర్క్ చేస్తున్నారు.

# నాని సరిపోదా శనివారంపై ఉత్కంఠ

స్టార్ హీరో నాని ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం' . నాని 31గా వస్తున్న ఈ సినిమాకు వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్నాడు. నాని సరసన ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. ఎస్‌జే సూర్య కీలక పాత్రలో నటిస్తున్నాడు. డివివి ఎంటర్‌టైన్ మెంట్స్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి హై బ్జడెట్, భారీ కాన్వాస్‌తో ఈ సినిమా తెరకెక్కుతుంది. ఈ చిత్రం ఆగష్టు 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే మూవీ నుంచి విడుదల చేసిన గ్లింప్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే నేడు ఎస్‌జే సూర్య పుట్టినరోజు సందర్భంగా మూవీ నుంచి ఆయనకు బర్త్‌డే విషెస్ తెలుపుతూ.. స్పెషల్ వీడియో విడుదల చేశారు. అప్పట్లో నరకాసురుడు అనే రాక్షసుడు ఉండేవాడు. అతడు ప్రజల్ని బాగా హింసించేవాడు. అందుకే వాడిని వధించడానికి శ్రీ కృష్ణుడు సత్యభామతో కలిసి వెళతాడు. అంటూ హ్యాపి బర్త్ డే సర్ అంటూ విషెస్ తెలిపారు. ఇక ఈ సినిమాలో ఎస్‌జే సూర్య ఓ క్రూరమైన పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించబోతున్నట్లు తెలుస్తుంది. తన అరాచకాల్ని హీరో(నాని) హీరోయిన్‌తో కలిసి ఎలా ఎదిరించాడన్నది సినిమా కాన్సెప్ట్. యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రంలో సాయికుమార్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇక 'అంటే సుందరానికి' సినిమా తర్వాత నాని – వివేక్ కాంబో రిపీట్ అవుతుండడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా ఆగష్టు 29న ప్రేక్షకుల ముందుకు రానుంది.






# సితార పుట్టిన రోజు... మహేశ్ స్పెషల్ వీడియో



శనివారం మహేశ్‌బాబు గారాలపట్టీ సితార పుట్టినరోజు .ఈ సందర్భంగా తన కుమార్తెకు ప్రత్యేకంగా విషెస్ తెలిపారు సూపర్‌స్టార్. సోషల్ మీడియా వేదికగా సితార ఫొటో షేర్ చేసిన ఆయన 'హ్యాపీ 12 మై సన్‌షైన్' అని పేర్కొన్నారు. మరోవైపు, నమ్రత సైతం ఇన్‌స్టా వేదికగా స్పెషల్ వీడియో షేర్ చేశారు. సితార చిన్నప్పటి ఫొటోలు వీడియోలు కలిపి ఓ వీడియో క్రియేట్ చేశారు. 'నా చిట్టి ప్రయాణ సహచరురాలికి జన్మదిన శుభాకాంక్షలు. వివిధ దేశాలు లెక్కలేనన్ని జ్ఞాపకాలు నువ్వు ఎల్లప్పుడూ నాకొక ట్రావెల్ గైడ్‌లా ఉంటూ ప్రతి ప్రయాణాన్ని ప్రత్యేకం చేశావు. ఈ క్షణాలు, జ్ఞాపకాలను సెలబ్రేట్ చేసుకుంటున్నా. ఐ లవ్ యూ మై స్వీట్‌హార్ట్' అని క్యాప్షన్ ఇచ్చారు నమ్రత. ఈ పోస్ట్‌కు స్పందించి పలువురు నెటిజన్లు సితారకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతున్నారు. చిన్నప్పటి నుంచే సితార సేవా కార్యక్రమాల్లో పాల్గొంటుంటారు సితార. గత ఏడాది తర పుట్టినరోజు పలువరు విద్యార్థినీలకు సైకిళ్లు బహుమతిగా ఇచ్చింది. ఇటీవల ఓ నగల దు?కాణానికి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించారు. ఆ ప్రకటన ద్వారా తాను అందుకున్న పారితోషికాన్ని సేవల కోసం వినియోగించారు. భవిష్యత్తుల్లో నటిని అవుతానని, మంచి అవకాశం వస్తే తప్పకుండా ఆ యాక్ట్ చేస్తానని ఇప్పటికే వెల్లడించారు. అందుకే డాన్స్ కూడా నేర్చుకుంటోంది.

# వెబ్ సీరిస్‌లపై దృష్టి పెట్టిన సమంత

ఒకప్పుడు వరుస సినిమాలతో బాక్సాఫీస్ వద్ద అలరించిన సమంత ఇప్పుడు ఓటీటీ వేదికగానూ సత్తా చాటుతున్నారు. ఇప్పటికే 'ఫ్యామిలీమెన్ 2'లో ఆమె నటనకు అందరూ ఫిదా అయ్యారు. ఇప్పుడు మరో సరికొత్త సిరీస్‌లోనూ సమంత నటించడానికి సిద్ధమయ్యారు. రాజ్ అండ్ డీకే సారథ్యంలో రూపొందబోయే పీరియాడిక్ ఫాంటసీ సిరీస్‌లో సమంత నటించబోతున్నారట. ఆదిత్య రాయ్‌కపూర్, వామికా గబ్బీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'తుంబాద్' వంటి మిస్టీరియస్ థ్రిల్లర్ తీసిన రాహి అనిల్ బార్వె దీనికి దర్శకత్వం వహించనున్నారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన వివరాలను ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ వెల్లడించనుంది. ఇప్పటివరకూ భారతీయ సినిమా తెరపై రాని సరికొత్త కథాంశంతో ఈ సిరీస్‌ను తీయబోతున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. సిరీస్ చూస్తున్న ప్రేక్షకుడిని మరో సరికొత్త ఊహా ప్రపంచంలోకి తీసుకెళ్తుందట. మోసం, నమ్మకద్రోహం, ప్రేమ, త్యాగం ఇలా అన్ని అంశాలను మేళవించిన కథతో దీన్ని తీర్చిదిద్దుతున్నారు. తొలుత దీన్ని సినిమాగా తీయాలనుకున్నా, తెరపై ఆవిష్కరించే అంశాలు ఎక్కువగా ఉండటంతో వెబ్‌సిరీస్‌గా మలిచారు. ఆదిత్యరాయ్ కపూర్‌కు ఇది రెండో వెబ్‌సిరీస్ ఆయన నటించిన 'ది నైట్ మేనేజర్' డిస్నీ?హాట్‌స్టార్ వేదికగా మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. ఇక సమంత రాజ్ డీకే దర్శకత్వంలో 'సిటాడెల్: హనీ బన్నీ'లో నటిస్తోంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సిరీస్ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకొంటోంది. వామిా గబ్బీకి ఇది ఐదో వెబ్‌సిరీస్. రాజ్ అండ్ డీకేల విషయానికొస్తే నెట్‌ఫ్లిక్స్ కోసం వాళ్లు చేసిన 'గన్స్ అండ్ గులాబ్స్' పర్వాలేదనిపించింది. ప్రస్తుతం 'ఫ్యామిలీమెన్ 3' చేస్తున్నారు. ఇది అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది.

# నేషనల్ క్రష్..
## అభిమానులు ఇచ్చిన ట్యాగ్



'యానిమల్'తో ఒక్కసారిగా ఫేమ్ సొంతం చేసుకున్నారు బాలీవుడ్ నటి త్రిప్తి దిమ్రి. ఈ సినిమా తర్వాత యూత్‌లో ఆమెకు ఫాలోయింగ్ విపరీతంగా పెరిగింది. దీంతో ఆమె నేషనల్ క్రష్‌గా గుర్తింపు సొంతం చేసుకున్నారు. అభిమానులు తనని 'నేషనల్ క్రష్' అని పిలవడంపై తాజాగా త్రిప్తి స్పందించారు. ఆ ట్యాగ్ విషయంలో తాను ఆనందంగా ఉన్నట్లు చెప్పారు. బాలీవుడ్‌లో కెరీర్ మొదలుపెట్టి దాదాపు ఏడేళ్లు అయ్యింది. అందుకు సంతోషంగా ఉన్నా. గొప్ప నటీనటులు, దర్శకులతో వర్క్ చేస్తానని కెరీర్ ఆరంభంలో ఎప్పుడూ అనుకోలేదు. ఎందుకంటే, యాక్టింగ్‌ను నేను సీరియస్‌గా తీసుకోలేదు. మొదటి సినిమా పూర్తైన తర్వాత కెరీర్‌ను విధికే వదిలేశా. 'ఒక సినిమా పూర్తి చేశా. అదృష్టం ఉంటే రెండో సినిమా రావొచ్చు' అనుకున్నా. అలాంటి సమయంలో 'లైలా మజ్ను' కోసం ఆడిషన్‌లో పాల్గొన్నా. ఆనాటి నుంచి యాక్టింగ్‌పై దృష్టిపెట్టా. నటనలో శిక్షణ తీసుకొన్నా. ప్రేక్షకులు నా నటనతో కనెక్ట్ అవుతున్నారు. నేషనల్ క్రష్ అనేది నా దృష్టిలో ట్యాగ్ మాత్రమే కాదు. అభిమానుల ప్రేమ. వాళ్లు నన్ను అలా పిలుస్తున్నందుకు ఆనందంగా ఉన్నా. ఇది నాపై మరింత బాధ్యత పెంచింది. ప్రేక్షకులను అలరించే చిత్రాల్లో నటించాలని తెలియజేసింది' అని తెలిపారు.

త్రిప్తి నటించిన సరికొత్త చిత్రం 'బ్యాడ్‌న్యూస్'. ఆనంద్ తివారీ దర్శకుడు. విక్కీ కౌశల్, అమీా విర్క్ కీలక పాత్రలు పోషించారు. ఎన్నో అంచనాల మధ్య శుక్రవారం ఈసినిమా ప్రేక్షకుల ముందుకువచ్చింది. మంచి టాక్ సొంతం చేసుకుంది.

# వైవిధ్యంగా 'క' మూవీ నిర్మాణం



కిరణ్ అబ్బవరం నటించిన 'క' సినిమా నుండి కొన్ని రోజుల క్రితం టీజర్ విడుదలైంది. ఆసక్తికరంగా వున్న ఈ టీజర్ చూశాక, సినిమా వైవిధ్యంగా ఉంటుందని తెలుస్తోంది. సుజిత్, సందీప్ లు ఇద్దరూ ఈ సినిమాకి దర్శకత్వం వహించారు. సాయంత్రం మూడు గంటలు అవగానే ఆ గ్రామంలో చీకట్లు ముసురుకోవటం టీజర్ లో చూసాం. అలాగే కిరణ్ అబ్బవరం ఇందులో పోస్ట్ మేన్ గా కనిపిస్తాడు. ఒక వైవిధ్యమైన లుక్స్ తో ఈ సినిమా అతను వుండబోతున్నట్టుగా అర్థం అవుతోంది. అయితే ఈ టీజర్ లోనే ఒక డాగ్ ని కూడా చూస్తాము. ఆ డాగ్ సినిమాలో ఒక భాగం అని చెపుతున్నాడు కిరణ్ అబ్బవరం. మామూలుగా అయితే సినిమాలో కుక్కలు కావాల ంటే ట్రైనింగ్ పొందిన డాగ్స్ ని తీసుకువస్తూ వుంటారు. కానీ ఈ సినిమాలో నటించిన డాగ్ మాత్రం అలా వచ్చింది కాదు. 'అది ఒక స్ట్రీట్ డాగ్, దాన్ని తెచ్చి సుమారు 8 నెలలు నేనే ట్రైనింగ్ ఇచ్చాను. నా దగ్గర ఉండేట్టు చేసుకున్నాను, ఆ తరువాత కొన్ని నెలలు దానికి సరైన ఆహారం అది ఇచ్చి నా దగ్గర అది పూర్తిగా మచ్చిక అయ్యాక, పూర్తి ట్రైనింగ్ ఇచ్చి అప్పుడు సినిమా చిత్రీకరణ కోసం దానితో పని చేశాం,' అని చెప్పారు కిరణ్ అబ్బవరం.

ప్రస్తుతం ఈ డాగ్ కిరణ్ అబ్బవరం ఇంట్లో వుంది. ఈ సినిమాలో సెకండ్ హైయెస్ట్ పైడ్ యాక్టర్ ఎవరైనా వున్నారు అంటే అది ఈ డాగ్ మాత్రమే అని సరదాగా చిత్ర యూనిట్ సభ్యులు అనుకుంటూ వుంటారు. ఎందుకంటే స్ట్రీట్ డాగ్ అయినా, దానికి మంచి ఆహారం, దాని బాగోగులు చూసేందుకు గాను చాలా ఖర్చు పెట్టినట్టుగా తెలుస్తోంది. ఆ డాగ్ రోజూ మాంసాహారం లేకపోతే ముద్ద ముట్టదు అని తెలిసింది. అందుకని ఈ డాగ్ సెకండ్ హైయెస్ట్ పెయిడ్ యాక్టర్ ఈ సినిమాలో అని అంటూ వుంటారు చిత్ర యూనిట్. సినిమాలో ఈ డాగ్ ఒక ప్రముఖ పాత్ర పోషిస్తుంది

# ఘనంగా "వెల్ నెస్ హాస్పటల్" ప్రారంభోత్సవం.





- ముఖ్య అతిథిగా ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ చీఫ్ వినయ్ కుమార్ రెడ్డి హాజరు.
- కొంపల్లి వద్ద ఆధునిక సౌకర్యాలతో ఆసుపత్రి నిర్మాణం.
- పాల్గొన్న యాజమాన్యం సుమన్ గౌడ్ తాళ్ళ, ఎండీ అసద్ ఖాన్, వివేకానంద రెడ్డి, మెడికల్ డైరెక్టర్ జెఎన్ వెంకట్, జిఎస్ రెడ్డి.





**వేగుచుక్క న్యూస్, కొంపల్లి (హైదరాబాద్) జులై 20:**

ఆధునిక సౌకర్యాలతో కొంపల్లి వద్ద నిర్మించిన "వెల్ నెస్ హాస్పటల్" ను శనివారం ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ చీఫ్ వినయ్ కుమార్ రెడ్డి, ఆయన సతీమణి అనన్య రెడ్డి చేతుల మీదుగా ఆసుపత్రి ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వినయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, జాతీయ రహదారికి ఆనుకొని ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండే విధంగా యాజమాన్యం ఆసుపత్రి నిర్మించడం అభినందనీయం అని అన్నారు. అన్ని రకాల వైద్య సేవలు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలకు ఆరోగ్యం విషయంలో మంచి సేవ చేస్తూ ఇంకా ఎన్నో శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ సందర్భంగా హాస్పటల్ యాజమాన్యం మేనేజింగ్ డైరెక్టర్స్ సుమన్ గౌడ్ తాళ్ళ, ఎండీ అసద్ ఖాన్, వివేకానంద రెడ్డి, మెడికల్ డైరెక్టర్ కోరుట్ల నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు జెఎన్. వెంకట్, వైస్ ప్రెసిడెంట్ జిఎస్. రెడ్డికి వినయ్ కుమార్ రెడ్డి అభినందనలు తెలిపారు.
హాస్పటల్ యాజమాన్యం మేనేజింగ్ డైరెక్టర్స్ సుమన్ గౌడ్ తాళ్ళ మాట్లాడుతూ, సేవ దృక్పథం కలిగిన వినయ్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా తమ ఆసుపత్రి ప్రంభించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రజలకు సాధ్యమైనంత తక్కువ ఖర్చుకే వైద్యం అందించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. అనంతరం వినయ్ కుమార్ రెడ్డి, అనన్యరెడ్డి లను ఆసుపత్రి యాజమాన్యం ఘనంగా సన్మానించారు.

# బహుజనలెఫ్ట్ పార్టీ

## జిల్లా అధ్యక్షురాలిగా సబ్బని లత ఎన్నిక.

### - ప్రధాన కార్యదర్శిగా అబ్బగోని అశోక్ గౌడ్.

**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, జులై 20:**



బహుజనలెఫ్ట్ పార్టీజిల్లా అధ్యక్షురాలిగా సబ్బని లత, ప్రధాన కార్యదర్శిగా అబ్బగోని అశోక్ గౌడ్ ను ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ లోగల బహుజన లెఫ్ట్ పార్టీ(బహుజన కమ్యూనిస్టు) బిఎల్పి
జిల్లా కార్యాలయంలో సబ్బని లత అధ్యక్షతన శనివారం పార్టీ జిల్లా జనరల్ బాడీ సమావేశం జరిగింది. సమావేశానికి బహుజన లెఫ్ట్ పార్టీ (బిఎల్ పి) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ హాజరు కాగా, 17 మందితో జిల్లా నూతన కమిటిని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలుగా – సబ్బని లత, ఉపాధ్యక్షులుగా టి.రాజు, సాయి కుంబ్లే, ప్రధాన కార్యదర్శిగా అబ్బగోని అశోక గౌడ్, సహయ కార్యదర్శులుగా బి. జగదీష్, ఎం.డి.సయ్యద్, కోశాధికారిగా దండు జ్యోతి నీ ఎన్నుకున్నారు. జిల్లా కమిటి సభ్యులు గా
రాజేందర్, శంకర్, మోహన్, యాదయ్య, గీతాంజలి, బాల్ రాజ్, సుజాత, జి.శ్రీమాన్, ఎం.అజయ్, చంద్ర గౌడ్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ మాట్లాడుతూ, మార్క్సిజం అంబేద్కరిజం సైద్ధాంతిక రాజకీయ ఆలోచన విధానంతో పని చేస్తున్న బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) భారతీయ నమూనా మార్క్సిజం అంబేద్కరిజం సైద్ధాంతిక రాజకీయ ఆలోచన విధానంతో, బహుజన శ్రామిక ప్రజలకు రాజ్యాధికారం కోసం ఉద్యమిస్తుందనీ అన్నారు.
బహుజన లెఫ్ట్ పార్టీ ఒకవైపు కార్మిక సంఘాల నిర్మాణం, మరోవైపు కుల సంఘాల నిర్మాణం ద్వారా కుల, వర్గ పోరాటాల ద్వారా కుల వర్గ నిర్మూలన కోసం ఉద్యమిస్తున్నామని పేర్కొన్నారు.

# ఏడు నెలల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేశాం.

## - రైతు రుణమాఫీ సంబరాల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు.





**వేగుచుక్క న్యూస్, బిక్కనూరు ( కామారెడ్డి), జులై 20**

వరంగల్ రైతు డిక్లరేషన్ లో రాహుల్ గాంధీ ఇచ్చినమాటకు కట్టుబడి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా, సీఎం రేవంత్ రెడ్డి సకాలంలో రూ. 2 లక్షల లోపు రైతు రుణమాఫీ చేశారని సాంస్కృతిక పర్యాటక ,శాఖ మరియు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేశామని తెలిపారు. రైతు రుణమాఫీ సంబరాల్లో భాగంగా శనివారం బిక్కనూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో సాంస్కృతిక పర్యాటక శాఖ, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జిల్లా కలెక్టర్ ఆశీస్ సాంగ్వన్, ఇతర ప్రజాప్రతినిధులు రైతులు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా .. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజలే కేంద్రబిందువుగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ప్రాజెక్ట్ ల పేరుతో ప్రభుత్వ సొమ్మును కాంట్రాక్టర్లకు దోసి పెట్టారని ధ్వజమెత్తారు. విద్యా, వైద్య రంగాన్ని అధ్వాన్నంగా తయారు చేశారని అన్నారు.
ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ఎక్కువ సమయం కేటాయించాలని, వారి పట్లమర్యాదగా నడుచుకోవాలని అధికారు లకు హితవు పలికారు. ప్రజా పిర్యాదులను పెండింగ్ లో పెట్టరాదని, వారం, పది రోజుల్లో వాటిని పరిష్కరిం చాలని స్పష్టం చేశారు. కామారెడ్డి జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్ట్ లో భాగంగా చేపట్టిన లో ప్యాకేజీల పెండింగ్ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు .అనం తరం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ, స్వాతంత్రం వచ్చిన కొత్తలో ఆహార సంక్షోభం నుండి ఆనాటి ప్రధాన మంత్రి జవహర్లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన కార్యక్రమాల ద్వారా గట్టెక్కామని, ఆధునిక దేవాలయాలుగా పిలుచుకునే పోచంపాడు, నాగర్ సాగర్ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఆంధ్ర, తెలంగాణ వరిధాన్యకారంగా మారిందని అన్నారు. ఇందిరాగాంధీ బ్యాంకుల జాతీయకరణ ద్వారా సామాన్య ప్రజానీకానికి కూడా బ్యాంకుల ద్వారా రుణాలు పొందే అవకాశం లభించిందని, సోనియా గాంధీ వలన తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, రాహుల్ గాంధీ ప్రకటిం చినట్టు ఈనాడు 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ జరిగిందని అన్నారు. ఎవరు ఎన్ని పుకార్లు చెప్పినా నమ్మ వద్దని రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ జరుగు తుందని ఎవరికైనా ఇబ్బంది ఉంటే వ్యవసా య శాఖాధికారు లను సంప్రదించాలని అన్నారు. జిల్లాలో 3 లక్షల 56వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించిన ప్రాణహిత చేవెళ్ల పథకం కాళేశ్వరంగా మారిన తర్వాత పనులు ముందుకు సాగడం లేదని అన్నారు.జిల్లా కలెక్టర్ ఆశీస్ సాంగ్వాన్ మాట్లాడుతూ, జిల్లాలో మొదటి విడుతగా లక్ష రూపాయల రుణమాఫీ 49541 మంది రైతులకు 235 కోట్ల 61 లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని అన్నారు. ఏదైనా సాంకేతిక కారణాలతో రుణమాఫీ జాబితాలో లేని రైతులు వ్యవసాయశాఖ అధికారులను గాని జిల్లా వ్యవసాయశాఖ అధికారి కార్యాల యంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ 7288894616 నెంబర్కు గాని సంప్రదించాలని అన్నారు.

**అనంతరం రైతు వేదిక ఆవరణలో మొక్కలు నాటారు.**

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సింధు శర్మ, జిల్లా అటవీ శాఖ అధికారి నికిత, కామారెడ్డి ఆర్డీవో రంగనాథ చారి, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# పర్యాటక ప్రాంతాలను గుర్తించాలి



**ప్రజలు వెళ్లేలా ప్రమోట్ చేయాలి**
**పర్యాటక ఆదాయంపైనా దృష్టి పెట్టాలి**
**డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క సూచన**

**హైదరాబాద్:** రాష్ట్రంలో అదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్ వంటి జిల్లాల్లో పచ్చని, దట్టమైన అడవులు.. జలపాతాలు ఉన్నాయి. వాటిని గుర్తించి ఐటీ ఉద్యోగులు, జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించి ఆదాయాన్ని పెంచుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శనివారం ఆయన సచివాలయంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి పర్యాటక, సాంస్కృతిక, క్రీడా, ఎన్సీసీపై బడ్జెట్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. సాంస్కృతిక సారధి కళాకారులు గత ఏడు నెలలుగా ఏ విధులు నిర్వహిస్తున్నారని డిప్యూటీ సీఎం ఆరా తీశారు. కళాకారులను సమాజ అభివృద్ధికి పూర్తిగా వాడుకోవడం లేదు.. వారి సేవలు వినియోగించుకునేందుకు ఓ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో అనేక నిర్మాణాలు ప్రారంభించి మధ్యలో వదిలేసింది.. ఫలితంగా వందలాది కోట్ల రూపాయల ప్రజాధనం నిరుపయోగమైంది.. గతంలో ప్రారంభించి 90 శాతం పూర్తి చేసిన భవనాలను గుర్తించి నిర్మాణాలు పూర్తి చేయండి, మిగిలిన భవనాలు దశలవారీగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.
రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో క్రీడా మైదానాలు ఉన్నాయి.. వాటిని నిరుపయోగంగా ఉంచడం మూలంగా ఆక్రమణలు జరుగుతున్నాయి.. అధికారులు వెంటనే స్పందించి.. నిత్యం క్రీడలు నిర్వహించి? మైదానాలను ఉపయోగించుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని రెసిడెన్షియల్ విద్యార్థులకు క్రీడా మైదానాల్లో క్రీడలు నిర్వహించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. కొన్నిచోట్ల క్రీడా మైదానాలు ఆక్రమణలకు గురైనట్టుగా సమాచారం ఉంది.. వెంటనే ఆ విషయాలపై దృష్టి సారించి ఆక్రమణ దారులను ఖాళీ చేయించండి.. ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. ఏడాది మొత్తంగా ప్రభుత్వ క్రీడా మైదానాల్లో యాక్టివిటీ ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. పర్యాటక శాఖ సొంత ఆస్తులు, లీజ్‌లో ఉన్న ఆస్తుల వివరాలపై ఒక సమగ్ర నివేదిక ప్రభుత్వానికి సమర్పించాలని సంబంధిత అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, అడవులను పర్యాటక సాంస్కృతిక శాఖలు పెద్ద సంఖ్యలో వినియోగించుకుని ఆదాయం పెంచుకోవాలని సూచించారు. కల్చర్ అంటే ఆటలు, పాటలు అనుకుంటున్నారు.. కానీ కల్చర్ అంటే జీవన విధానం అని చాలా మందికి తెలియదని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కళాకారులు ప్రజల జీవన విధానంలో మెరుగైన మార్పులు తెచ్చేందుకు.. తీసుకునే ఆహారం, వేసుకునే దుస్తులు ఇలా అన్ని అంశాల పైన గ్రామీణ ప్రజానీకాన్ని చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న చెక్ పోస్టులను పూర్తిస్థాయిలో ఆధునికీకరించేందుకు సమగ్ర ప్రణాళికలు చేయాలని అధికారులను మంత్రి జూపల్లి ఆదేశించారు. రాష్ట్రంలో సంస్కృతి, వారసత్వ సంపదలు ఘనంగా ఉన్నా.. ఆ మేరకు వాటిని వినియోగించుకుని పూర్తిస్థాయిలో ఫలితాలు సాధించలేకపోతున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను పెద్ద సంఖ్యలో ఆకర్షించేందుకు దృష్టి సారించాలని మంత్రి జూపల్లి ఆదేశించారు.

# క్రమంగా పెరుగుతున్న గోదావరి

**ఎగవ నుంచి భారీగా వస్తోన్న వరదనీరు**

**లోతట్టు ప్రాంతాల ప్రజల అప్రమత్తం**



**భద్రాద్రి కొత్తగూడెం:** రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపోర్లుతున్నాయి. పలు ప్రాజెక్టులకు వరద పోటెత్తింది. దీంతో ప్రాజెక్టులన్నీ నిండుకుండలా మారాయి. ఈ క్రమంలో ఆయా ప్రాజెక్టుల పరిధిలోని లోతట్టు ప్రాంతాలను అధికారులు అప్రమత్తం చేశారు.
భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుపోతోంది. ప్రస్తుతం గోదావరి నీటిమట్టం 31.5 గా ఉంది. దీంతో అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను అలర్ట్ చేశారు. మరోవైపు తాళిపేరు ప్రాజెక్టు 20 గేట్లు ఎత్తి 66,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాలైన తాళి పేరు ప్రాజెక్టు, పెరూరు వైపు నుంచి వరద నీరు రావడంతో నది నీటిమట్టం ఇంకా పెరుగుతుందని అధికారులు తెలుపుతున్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు జాలారులు నదివైపు వెళ్లొద్దని జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ హెచ్చరికలు జారీ చేశారు. జిల్లాతో పాటు ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి వరద పోటెత్తింది. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు. వరద ఇలాగే కొనసాగితే లోతట్టు ప్రాంతాలకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం కనిపిస్తుంది. అల్పపీడన ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వచ్చే నాలుగు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ విభాగం హెచ్చరించింది.

# పాఠశాల పనివేళల్లో మార్పులు

## ఉదయం 9 నుంచి సాయంత్రం 4.15 వరకు టైమింగ్స్

హైదరాబాద్: తెలంగాణ విద్యాశాఖ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పని వేళలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు విద్యాశాఖ పనివేళల మార్పు గురించి ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పని చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఉన్నత పాఠశాలలు ఉదయం 9.30
నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు పని చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూల్స్ యథావిధిగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు కొనసాగుతాయని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఇక హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో కూడా యథావిధిగా ఉదయం 8.45 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పాఠశాలల నిర్వహణ కొనసాగనున్నట్లు స్పష్టం చేశారు.



# కాంగ్రెస్ కుట్రలు గోదావరిలో కొట్టుకు పోయాయి

## కాళేశ్వరం సగర్వంగా సలాం చేస్తోంది: కెటిఆర్ ట్వీట్



**హైదరాబాద్:** ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నదిలో కాంగ్రెస్ కుట్రలే కొట్టుకుపోయాయని.. కానీ, కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రం సగర్వంగా తలెత్తుకుని సలాం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ల కల్వకుంట్ల తారకరామారావు పేర్కొన్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరిలో వరద పోటెత్తుతున్నది. మేడిగడ్డ బరాజ్‌లో పిల్లర్లు కుంగిన విషయం తెలిసిందే. దీనిపై అధికార కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కేటీఆర్ ఆ పార్టీకి ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆ పార్టీ సర్కారుకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. పోటెత్తిన వరదకు దుష్టశక్తుల పన్నాగాలే పటాపంచలయ్యాయన్నారు. కేసీఆర్ సమున్నత సంకల్పం.. జై కొడుతోంది.. జల హారతి పడుతోందని పేర్కొన్నారు. లక్షల క్యూసెక్కుల గంగా ప్రవాహంలో లక్షకోట్లు వృధా చేశారనే విమర్శలే గల్లంతయ్యాయన్నారు. మేడిగడ్డ బ్యారేజీ మాత్రం.. మొక్కవోని దీక్షతో నిలబడిందన్నారు. కొండంత బలాన్ని చాటిచెబుతోందని పేర్కొన్నారు. ఎవరెన్ని కుతంత్రాలు చేసినా.. దశాబ్దాలుగా దగాపడ్డ.. ఈ తెలంగాణ నేలకు ఇప్పటికీ.. ఎప్పటికీ.. మేడిగడ్డే మన రైతుల కష్టాలు తీర్చే 'మేటి'గడ్డ అన్నారు. కాళేశ్వరమే కరువును పారదోలే 'కల్పతరువు' అని తెలిపారు. బురద రాజకీయాలను భూస్థాపితం చేసిన ఈ మానవ నిర్మిత అద్భుతానికి. కేసీఆర్ సర్‌కు తెలంగాణ సమాజం పక్షాన మరోసారి సెల్యూట్' అంటూ ట్వీట్ చేసిన కేటీఆర్.. ఈ సందర్భంగా గోదావరిలో వరదకు సంబంధించిన వీడియోను సైతం జతం చేశారు.